క్లుప్తంగా

విద్యా సామగ్రి పంపిణీ

చీరాల అర్బన్: చదువుతో పాటు సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ విద్యార్థులు మానవతామూర్తులు కావాలని చీరాల మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. శనివారం స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన నోటుబుక్స్, సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు ఎ.నాగవీరభద్రాచారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 110 మందికి విద్యార్థినులకు విద్యా సామగ్రిని అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.మురళి, రిటైర్డు ప్రిన్సిపాల్ బి.బ్రహ్మారెడ్డి, కట్టా రాజీవినయ్‌కుమార్, యల్లమందారెడ్డి, హరిహరప్రసాద్, శివాంజనేయప్రసాద్, పోలుదాసు రామకృష్ణ పాల్గొన్నారు.

వీరరాఘవస్వామికి ప్రత్యేక పూజలు

చీరాల అర్బన్: పట్టణంలోని వీరరాఘవ స్వామి దేవాలయంలో శనివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమావాస్య రోజున స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అర్చకులు దిట్టకవి వాసుదేవాచార్యులు తెలిపారు. అలానే స్వామివారికి ప్రీతికరమైన బెల్లంను నైవేద్యంగా సమర్పించి భక్తులకు ప్రసాదంగా అందించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు



ఫీల్డ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న ఎంపీడీవో

బల్లికుర: గ్రామాల వారీగా ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా పారదర్శకంగా పూర్తి చేయించాలని ఎంపీడీవో జీ పాండురంగస్వామి కోరారు. శనివారం స్థానిక పరిషత్ కార్యాలయంలో 21 గ్రామ పంచాయతీలోని ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన లోపాలు గుర్తు చేశారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన వివిధ పనులను గుర్తిస్తూ అంచనాలతో గ్రామసభ ఆమోదం పొందాల్సి ఉందన్నారు. గ్రామాల వారీగా ప్రాధాన్యత గల పనులను గుర్తించాలన్నారు. మావేశంలో ఉపాధి హామీ పథక ఏపీవో జీ. రమాదేవి పాల్గొని మాట్లాడారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

చీరాల రూరల్: ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని.. ప్లాస్టిక్ వలన పర్యావరణానికి తీవ్ర ముప్పు కలుగుతుందని 23 ఆంధ్రా బెటాలియన్ గుంటూరు రేంజ్ సీవో గోపాల్ త్రిపాఠి అన్నారు. ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా ఎన్‌సీసీ విద్యార్థులచే సీవో కార్యాలయం నుంచి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కొత్తపేట, ప్రసాదనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంటికొక్క మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాజర్ జయిద్, రాజేష్, పిఏ స్టాఫ్, ఎఎస్ఎస్, కేర్‌టేకర్స్, సెయింటాన్స్ స్కూలు, వేటపాలెం స్కూలు, జూనియర్ కాలేజీ, చీరాల ఇంజనీరింగ్ కాలేజి ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో సరైన సౌకర్యాలు లేవు

కారంచేడు: మండలంలోని దగ్గుబాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు వెక్కిరిస్తున్నాయని కారంచేడు కో ఆప్షన్ సభ్యుడు ముల్లా నూర్‌అహ్మద్ పేర్కొన్నారు. ఇటీవల చోటు చేసుకున్న గర్భిణి మహిళ ఘటనకు సంబంధించి ఆయన శనివారం ఆయన స్థానికులతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరా తీశారు. ఆస్పత్రిలోని ఇద్దరు డాక్టర్‌లను కలిసి మాట్లాడారు. ఆమె చీరాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించుకోవాల్సి ఉండగా ఇక్కడకు రావడంతో ఆమెను పరీక్షించి 10 రోజుల్లో ప్రసవం అయ్యే పరిస్థితుల్లో సర్జరీ అవసరమవుతుందని గుర్తించి ఆమెకు రక్తం తక్కువగా ఉండటంతో ఇంజక్షన్ ఇచ్చి చీరాలకు పంపామని వివరణ ఇచ్చారన్నారు. ఆ తరువాత గర్భిణి బంధువులతో కూడా మాట్లాడి విషయం తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ కొరత ఉందని, కుక్క కాటుకు మందులు అందుబాటులో లేవని వారు తెలియజేశారన్నారు. అదే విధంగా ఆస్పత్రిలో ప్రసవాలు జరగడం లేదని, గత పది నెలలుగా పూర్తి స్థాయిలో ఆపారనే విషయం గురించి ఆరా తీశారు. ఆపరేషన్ థియేటర్‌లో సౌకర్యాలు తక్కువగా ఉన్నాయని ఇక నుంచి ప్రసవాలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

చెలరేగుతున్న జూదరులు..!

- కూటమి పాలనలో విచ్చలవిడిగా జూదం
- లక్షల్లో చేతులు మారుతున్న వైనం
- డ్రోన్‌ల ద్వారా నిఘా ఉంచామంటున్న పోలీసులు



ఇంకొల్లులో జూదరులను పట్టుకున్న పోలీసులు (ఫైల్)

కారంచేడు: కూటమి ప్రభుత్వ పాలనలో జూదరులు యథేచ్ఛగా చెలరేగిపోతున్నారు. పర్చూరు నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు చేస్తున్నారు. అయినా జరుగుతున్న తంతు మాత్రం మానడం లేదు. పోలీసులు వస్తారు, పట్టుకుంటారు, కేసులు నమోదు చేస్తారనే భయం కంటే మావాళ్లు ఉన్నారు.. మాకు అండగా అనే ధైర్యంతోనే పేటాట స్థావరాలు నడుస్తున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఇటీవల మండల కేంద్రమైన కారంచేడుతో పాటు మేజర్ పంచాయతీలుగా ఉన్న స్వర్ణ, కుంకలమర్రు, దగ్గుబాడు, గ్రామాలతో పాటు ఆదిపూడి, నాయుడువారిపాలెం ప్రాంతంలోను జూదరులు పెద్ద ఎత్తున పట్టుబడుతున్నారు. గతంలో పేకాట ఆడేవారు అక్కడక్కడ దొరికినా పెద్దగా డబ్బు దొరికేది కాదు. ప్రస్తుత పాలనలో ఇటీవల కారంచేడు ఎస్సై షేక్ ఖాదర్‌బాషా దాడులు చేసి పట్టుకున్న సంఘటనలో లక్షల్లో నగదును స్వాధీనం చేసుకుంటున్నారు. ఇంత ఎక్కువగా పేకాటలు ఆడే వారికి ఆయా గ్రామాల్లోని కూటమి పెద్దల సహకారం ఉండటంతోనే ఇంతగా చెలరేగిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.

తీవ్ర చర్యలు చేపడితేనే..

- యద్దనపూడి మండలం చిమటావారిపాలెంలోను పోలీసులు దాడి చేసి పేకాడుతున్న జూదరులను అరెస్టు చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు.
- చినగంజాం మండలంలోని రాజుబంగారుపాలెంలో, చినగంజాం, పెదగంజాం ప్రాంతాల్లో ఇటీవల పోలీసులు దాడి చేసి పేకాడున్న వారిని అదుపులోకి తీసుకొని, నగదును స్వాధీనం చేసుకున్నారు.
- ఇంకొల్లు మండలంలోని ఇంకొల్లు, గంగవరం ప్రాంతాల్లోను ఎక్కువగా పేటాడున్న స్థావరాలపైనా పోలీసులు దాడులు చేశారు. అక్కడ కూడా అనేక మందిని జూదరులను అరెస్టు చేసి నగదు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. ఇలా ప్రతి రోజు ఏదో ఒక గ్రామంలో ఈ పేకాట స్థావరాలపై ఇటీవల స్థానిక పోలీస్‌లు దాడులు చేస్తున్నారు. బాపట్ల ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు పోలీస్‌లు గ్యాంబ్లింగ్‌పై ప్రత్యేక నిఘాను ఉంచుతున్నారు. కాలువ కట్టలు, పొలాల్లోని చెట్ల నీడన, పశువుల కొష్టాలు, చెరువు కట్టలమీద ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఈ నిఘాల్లో అక్కడక్కడ గ్రామస్థాయిలో పెద్ద తలకాయలు కూడా పట్టుపడుతున్నట్లు సమాచారం. ఇటీవల స్వర్ణ వద్ద పట్టుకున్నవారిలో ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగితో పాటు, రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు పట్టుబడినట్లు సమాచారం. పోలీస్ శాఖ మరింత పటిష్టమైన నిఘాను ఉంచి, పట్టుబడిన వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు చేపడితేనే ఈ జూదరులు దారికి వస్తారని ప్రజలు చెప్తున్నారు.

> **డ్రోన్ ద్వారా నిఘా ఏర్పాటు చేశాం..**
>
> గ్రామాల్లో అనేక ప్రాంతాల్లో పేకాట స్థావరాలను గుర్తించాం. ఎస్పీ వారి ఆదేశాల మేరకు టెక్నాలజీని ఉపయోగించి నిఘా వ్యవస్థను పటిష్టపరిచాం. గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఉంచాం. అసాంఘిక చర్యలు జరిగే అవకాశాలున్న ప్రాంతాల్లోను డ్రోన్ ద్వార నిఘా ఉంచాము. జూదం ఆడుతున్నవారిని అరెస్టు చేసి వారికి భవిష్యత్‌పై అవగాహన, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.
>
> – షేక్ ఖాదర్‌బాషా, ఎస్సై, కారంచేడు

అశ్రునయనాలతో మురళి అంత్యక్రియలు

- నివాళులర్పించిన నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్



మురళి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల అర్బన్: అనారోగ్యంతో మరణించిన సాక్షి చీరాల ఆర్సీ ఇన్‌చార్జి కడియం మురళి అంత్యక్రియలను శనివారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అశ్రునయనాలతో నిర్వహించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. శనివారం ఆయన అంత్యక్రియలను నిర్వహించగా భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంచి వ్యక్తిత్వం గల మనిషి కడియం మురళి అని ఆయన కొనియాడారు. పత్రికా రంగంలో సుదీర్ఘకాలం పని చేసిన ఆయన మచ్చలేని వ్యక్తిగా, స్నేహశీలిగా అందరికి సుపరిచితులన్నారు. ఆయన మరణం పత్రికా రంగానికి తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అలానే మాజీ ఎంపీ చిమటా సాంబు, మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు చెన్నుపాటి రాంబాబు, పలువురు రాజకీయ ప్రముఖులు, జర్నలిస్టులు ఆయనకు నివాళులర్పించారు. చీరాల ప్రాంతంలో ఎంతో మందికి సుపరిచితులుగా ఉన్న కడియం మురళి అంతిమయాత్రలో స్నేహితులు, జర్నలిస్టులు అధిక సంఖ్యలో అంతిమయాత్రలో సాగారు.

యూరియా కొరత సృష్టిస్తే చట్టరీత్యా చర్యలు



బల్లికురవలో ఎరువుల నిల్వలు తనిఖీ చేస్తున్న త్రీమెన్ కమిటీ



చినగంజాంలో సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

చినగంజాం: ఎరువుల దుకాణాలు, ఫ్యాక్టరీల్లో తనిఖీలు నిర్వహించి ఎక్కువ మోతాదులో యూరియా నిల్వలు ఉంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మండల వ్యవసాయాధికారి ఆర్ చంద్రశేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా సాగు చేసే వరి పంట సాగు మొదలవుతున్న దృష్ట్యా ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుందని వారు తెలిపారు. యూరియా గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రైవేట్ డీలర్‌లతో పాటు ప్రాథమిక పరపతి సంఘాలలో, రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైనప్పుడు యూరియా అందజేస్తారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు, వ్యవసాయాధికారులు కలిసి టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేసి మండలంలోని ఎరువులు దుకాణాలు, ఫ్యాక్టరీలలో తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులుతో పాటు పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రోమోర్ని తనిఖీ చేసిన త్రీమెన్ కమిటీ

బల్లికురవ: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు అవసరమైన యూరియా ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని వ్యవసాయ అధికారి పి. శ్రీనివాసరావు తెలిపారు శనివారం బల్లికురవ లోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. అవసరమైన మేరకు కొనుగోలుతో పంటలకు వేసుకోవాలన్నారు. రైతులకు కావలసిన ఎరువులను సొసైటీలు. రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచుతున్నామన్నారు. త్రీమెన్ కమిటీ తహసీల్దార్ పోలీస్ పర్సన్ మండల వ్యవసాయ అధికారి పర్యవేక్షణలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడతామన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు..

చీరాల రూరల్: ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుచేసేందుకు సిద్ధమవుతున్న రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని చీరాల వ్యవసాయ సహాయ సంచాలకులు టి. రత్నకుమారి శనివారం తెలిపారు. ప్రైవేటు డీలర్లతో పాటు ప్రాథమిక పరపతి సంఘాలలో రైతు సేవా కేంద్రాలలో రైతులకు అవసరమైన యూరియా అందజేస్తామని చెప్పారు. చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల్లోని రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఎవరైనా ఎరువులను అక్రమంగా నిల్వచేసి అధికరేట్లకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి



కొడవలివారిపాలెంలో ప్రకాశం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అద్దంకి: ప్రకాశం పంతులు జయంతిని అద్దంకిలో శనివారం ఘనంగా నిర్వహించారు. దానిలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధుడు గుడ్లవల్లి ఆదినారాయణ కుమారుడు, ఏపీ ఎలక్ట్రిసిటీ కమిషన్ వెంకటకృష్ణయ్య ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేశారు. ప్రకాశం మిత్రమండలి ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ప్రకాశం పంతులు ధైర్య, సాహసాలకు పెట్టింది పేరన్నారు. కార్యక్రమంలో మిత్రమండలి అధ్యక్షుడు శేషతల్పశాయి, గాడేపల్లి



చీరాలలో పంతులు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్



పూలమాల వేస్తున్న విశ్రాంత న్యాయమూర్తి

దివాకరదత్తు, చప్పిడి వీరయ్య, మన్నం త్రిమూర్తులు, తులసీదాస్, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, షేక్ మహ్మద్‌రఫీ, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కట్టారామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వీ మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అద్దంకికి ప్రకాశం మునిమనుమరాలు రాక..

పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల్లో 550 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు బహుమతులు అదిచే కార్యక్రమానికి ప్రకాశం పంతులు మునిమనుమరాలు కేవీఎల్ సుభాషిణి హాజరవుతున్నట్లు మిత్ర మండలి సభ్యులు తెలిపారు.

ప్రకాశం పంతులు అందరికీ ఆదర్శం..

కారంచేడు: ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని కొడవలివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఏ ఉమామహేశ్వరరావు అన్నారు. ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు జయంతిని పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



ఇంకొల్లులో నివాళులర్పిస్తున్న అధికారులు

చీరాల అర్బన్: స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శనివారం స్థానిక టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ కొతరపు జనార్ధన్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తేలప్రోలు నాగేశ్వరరావు, లావేటి తేజ, వేణు, రియాజ్, చంద్ర పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయాలను కొనసాగించాలని ఎంపీడీఓ కిరణ్, తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్‌లు అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శనివారం ఇంకొల్లులో ఘనంగా నిర్వహించారు.

మాదకద్రవ్యాల నివారణే ప్రధాన లక్ష్యం



పూనూరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాగమల్లేశ్వరి



ముప్పవరంలో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై వినదోబాబు

జే.పంగులూరు: మాదక ద్రవ్యాల నివారణే ప్రధాన లక్ష్యం అని రేణింగవరం ఎస్సై బీ వినోద్‌బాబు అన్నారు. మండల పరిధిలోని ముప్పవం జిల్లా పరిషత్ ఎయిడెడ్ పాఠశాలలో ఎస్సై ఆధ్వర్యంలో శనివారం మాదక ద్రవ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను పూర్తిస్థాయిలో నివారించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారి నడవడికను గమనించాలన్నారు. మత్తు పదార్థాలు ఎక్కడైనా విక్రయిస్తున్నా, తీసుకుంటున్న గాని, టోల్ ఫ్రీ నంబర్ 1972 ద్వారా సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదం విద్యార్థులతో చెప్పించారు.

యద్దనపూడి: మత్తు, మాదక ద్రవ్యాలు విద్యార్థులు, యువత భవిష్యత్‌ను నాశనం చేస్తాయని వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ సభ్యురాలు జి. నాగమల్లేశ్వరి అన్నారు. మండలంలోని పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల కు హెచ్‌ఐవీ, ఎయిడ్స్, సుఖ వ్యాధులు, డ్రగ్స్ డీ అడిక్షన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

అద్దంకి: అన్నదానం మహాదానం అని అయ్యప్ప సేవా సమితి సభ్యులు అన్నారు. ప్రతినెల అమావాస్య రోజు జరిగే అన్నప్రసాద వినియోగంలో భాగంగా శనివారం అమావాస్య సందర్భంగా అఖిల భారత అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములుగారి విగ్రహం వద్ద నిర్వహించారు. గడ్డం వెంకటేశ్వరరావు భార్య మస్తానమ్మ జ్ఞాపకార్థం వీరి కుమారుడు వెంకట్రావు, నవీన దంపతులు, కుటుంబ సభ్యుల సౌజన్యంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వాసు గురుస్వామి, తిరుపతిరెడ్డి గురుస్వామి, పెద్దన్న గురుస్వామి, కళ్యాపురం రామాంజనేయులు గురుస్వామి, కొండ్రగుంట శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న సంఘ సభ్యులు

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శక్తి బృందం

ఇంకొల్లు(చినగంజాం): శక్తి యాప్‌తో మహిళలు అత్యవసర పరిస్థితుల్లో రక్షణ పొందాలని చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఎస్సై ఏ హరిబాబు సూచించారు. మండలంలోని దుద్దుకూరు ఆచార్య రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శక్తి బృందం ఆధ్వర్యంలో పాఠశాల హెచ్‌ఎం కే భాస్కరరావు అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్ఐ జీ సురేష్ యాప్ ప్రయోజనాల గురించి వివరించారు. అత్యవసర సమయంలో మహిళలు తక్షణ సాయం పొందేందుకు యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరిస్తూ ఎవరైనా అనుమానిత వ్యక్తులు ఇబ్బంది పెడితే వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పాలని సూచించారు. హెల్ప్ లైన్ నంబర్‌లు 100, 112లకు సమస్య వచ్చినప్పుడు కాల్ చేయడం వలన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ జరుగుల బాలకృష్ణ, ఉపాధ్యాయులు ఎస్ శ్రీనివాసాచార్యులు, యా వెంచయ్య, బీ బాల సుబ్రహ్మణ్యం, కేఎం విజయకుమారి, పీ వెంకట్రావు, కే శంకరరావు, ఎం వెంకటేశ్వరరావు, సిబ్బంది తదితురులు పాల్గొన్నారు.

మండలంలో పొగాకు సాగు నిషేధం



వీఏఏలతో మాట్లాడుతున్న ఏఓ సుబ్బారెడ్డి

జే.పంగులూరు: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండల పరిధిలోని ఏ గ్రామంలో పొగాకు సాగు చేయకూడదని మండల వ్యవసాయాధికారి డీ సుబ్బారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం ఏవో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విలేజ్ అగ్రికల్చరర్ అసిస్టెంట్‌ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ పొగాకు సాగుపై గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారి చైర్మన్‌గాను, వీఏఏ కన్వీనర్‌గా, పంచాయితీ సెక్రటరీ, మహిళా పోలీస్‌ను కమిటీగా తయారు చేశామన్నారు. ఈ కమిటీ ప్రతి గ్రామంలో రైతులకు నల్లబర్లీ, తెల్లబర్లీ పొగాకు నారుమడులు సాగు చేసిన దున్నివేస్తారని తెలిపారు. పొగాకు పంటకు బదులు ఆరుతడి పంటలు, అపరాలు సాగు చేసే విధంగా చూడాలన్నారు. మండలస్థాయిలో టాస్క్ ఫోర్స్ చైర్మన్‌గా తహసీల్దార్ సింగారావు, ఎస్సై వినోద్‌బాబు ఉంటారని, కన్వీనర్ ఏఓ సుబ్బారెడ్డి, వైద్యాధికారి, సభ్యుడు, ప్రగతిశీల రైతు సభ్యునిగా ఏర్పాటు చేశామని తెలిపారు.

ఇంటర్ విద్యార్థికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సుబ్బారావు

అద్దంకి: మండలంలోని తిమ్మాయపాలెం హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థిని అన్నింగి స్రవంతికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సాయాన్ని దేశీ యూత్ తరుపున ఆమె తాతయ్య కూకట్ల సుబ్బారావు రూ.20 వేలను శనివారం అందజేశారు. ప్రస్తుతం ఈ విద్యార్థిని నర్సింగ్ రెండో సంవత్సరం ఒంగోలులోని నర్సింగ్ కళాశాలలో చదువుతోంది. కళాశాల ప్రిన్సిపాల్ పెంట్యాల గంగాధర్‌రావు విద్యార్థులు దాతల సహాయాన్ని ఉపయోగించుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, కూకట్ల శ్రీనివాస్, వినుకొండ సుధాకర్, ఈశ్వరయ్య, శ్రీనివాస్ రావు, కళాశాల లెక్చరర్‌లు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణ అందరి బాధ్యత



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐలు, సంస్థ ప్రతినిధులు

అద్దంకి: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నియంత్రించడంలో ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పట్టణ ఎస్సై సుబ్బరాజు అన్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, బాపట్ల జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం ఆధ్వర్యంలో అక్టోబర్ 12వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఐఈసీ అవగాహన కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. సీఐ సుబ్బరాజు, ఒంగోలు ఒకటో పట్టణ సీఐ వై నాగరాజు, పీఎస్ ఐ వెంకటేశ్వరరెడ్డి హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్ సంయుక్తంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెల్ప్ టీఐ అద్దంకి ఔట్ రిచ్ వర్కర్స్ టి దుర్గాభవాని, టి లక్ష్మీ తేజస్విని, ఎం మల్లేశ్వరి పాల్గొన్నారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

అద్దంకి రూరల్: సెప్టెంబర్ 13న అద్దంకి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి డీ. నాగవెంకటలక్ష్మీ తెలిపారు. శనివారం లోక్ ఆదాలత్ గురించి పోలీసు అధికారులు, బ్యాంకు అధికారులకు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీ చేసుకోదగిన కేసులు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. కేసులు రాజీ చేసుకునేందుకు అధికారులు ఇరువర్గాలతో మాట్లాడి ఇష్టపూర్వకంగా రాజీ చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జి జే. శ్రీ సీత, ఆడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బీ. అఖిల, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు, వై. శ్రీనివాసరావు, ఆడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వడవల్లి వీరనారాయణ, సీఐ సుబ్బరాజు, సంతమాగులూరు సీఐ వెంకటరావు, మార్టూరు సీఐ ఎం శేషగిరిరావు, ఎస్సైలు న్యాయవాదులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

అద్దంకి రూరల్: అద్దంకి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న కేసులో 10 మంది వ్యక్తులను, బహిరంగంగా మద్యం తాగుతున్న ఇద్దరిని అరెస్టు చేసి శనివారం సీఐ సుబ్బరాజు కోర్టులో హాజరు పరిచారు. వీరికి న్యాయమూర్తి బీ. అఖిల మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున, బహిరంగంగా మద్యం తాగుతున్నవారికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.